నర్సరీల్లో నారు...కొనేవారు లేరు!

- వర్షాభావం, ధరల పతనంతో పంటల సాగుపై రైతుల అనాసక్తి
- లక్షల నారు వృథా
- దాదాపు రూ.2 కోట్లు నష్టం


మొక్కలను దిబ్బల్లో పడేసేందుకు పెరికిన మొక్కలు

ధర్మవరం నియోజకవర్గంలో నర్సరీల వివరాలిలా..

మండలం	నర్సరీలు
ధర్మవరం	00
బత్తలపల్లి	71
తాడిమర్రి	00
ముదిగుబ్బ	32

బత్తలపల్లి: మార్కెట్‌లో ధరలు అమాంతం పడిపోవడం, వర్షాభావంతో రైతులు పంటల సాగుకు ముందుకు రావడం లేదు. దీంతో కొనే వారు లేక నర్సరీ నిర్వాహకులు లక్షల మొక్కలను పారవేస్తున్నారు. ఫలితంగా రూ.కోట్లు నష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు పోతున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో వందకు పైగా నర్సరీలున్నాయి. ఇందులో టమాట, వంగ, మిరప, వివిధ రకాల పూలు, కూరగాయల నారు విక్రయిస్తుంటారు. మార్కెట్‌లో ధరలు పడిపోవడం, వర్షాభావం రైతులు కూరగాయలు, పూల తోటల సాగుకు ముందుకు రావడం లేదు. దీంతో లక్షల మొక్కలను దిబ్బల్లో పడేస్తున్నారు. రూ.లక్షలు నష్టం వాటిల్లడంతో నర్సరీల నిర్వహణ భారమైంది. దీంతో కొంతమంది వాటిని మూసేస్తున్నారు. ఇప్పటికే ధర్మవరం, తాడిమర్రి మండలాల్లోని నర్సరీలు మూతపడ్డాయి.

దిక్కుతోచని స్థితిలో...

టమాట నారు ఒక్కొక్కటి రూ.50 పైసలు, వంగ రూ.40 పైసలు, పూలు రూ.60 పైసలు చొప్పున రైతులకు విక్రయిస్తుంటారు. ఎకరం టమాట సాగుకు సుమారు 15 వేల మొక్కలు అవసరమవుతాయి. సుమారు రూ.8 వేలు నారు మొక్కలకే ఖర్చు చేయాల్సి వస్తుంది. అయితే రెండు నెలలుగా టమాట ధరలు దారుణంగా పడిపోయాయి. దీంతో నెల రోజులుగా రైతులు పంటలను సాగు చేయడంలేదు. పంటలు సాగు కోసం దుక్కులు వేసిన పొలాలు బీడుగా దర్శనమిస్తున్నాయి. సాగు చేస్తామనే ధీమాతో రెండు నెలలకు ముందే కొందరు నర్సరీల్లో నారుకు ఆర్డర్లు ఇచ్చారు. తీరా ధరలు పతనం కావడం, వర్షాభావంతో బోర్లలో నీరు రాక పోవడంతో రైతులు పంటల సాగుకు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నా నారు సాగుకు పనికిరాని పరిస్థితి ఉంది. దీంతో నర్సరీల నిర్వాహకులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

ఐదు లక్షల నారు పడేశాం..


నర్సరీలో నెల రోజులుగా 5 లక్షల నారు మొక్కలు పడేశాం. వర్షాభావంతో రైతులు నారు కొనడానికి ముందుకు రావడం లేదు. జమ్మలమడుగుకు చెందిన రైతులు ఆర్డర్ ఇచ్చి ఇటువైపు రాలేదు. ముఖ్యంగా టమాట, వంగ, మిరప, పూల నారు పడేయంతో చాలా వరకు నష్టపోయాం.

–మారుమేని పెద్ద కుళ్లాయప్ప, నర్సరీ యజమాని, ధర్మవరం.

ప్రభుత్వం ఆదుకోవాలి


కొనుగోలుదారులు లేక నెల రోజులు పాటు పెంచిన నారు కళ్ల ముందే పడేస్తున్నాం. నర్సరీల ద్వారా ఎందరో కూలీలకు ఉపాధి కల్పిస్తున్న నర్సరీ యజమానులు ఇప్పుడు ఇబ్బందుల్లో ఉన్నారు. ఈ ఏడాది నర్సరీ యజమానులందరూ దారుణంగా నష్టపోయారు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

–గోవిందు గంగులప్ప, నర్సరీ యజమాని, తాడిమర్రి

రైతులకు తీవ్రనష్టం


అష్టకష్టాలు పడి పంటలు సాగు చేసినా మార్కెట్‌లో ధరలు పతనమై సాగు చేసిన రైతులందరూ నష్టపోతున్నారు. దీంతో పెట్టుబడులు కూడా చేతికి రావడం లేదు. ఇక వర్షాభావం కారణంగా వ్యవసాయ బోర్లలో నీరు రావండలేదు. మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలకు భూగర్భజలాలు పెరిగితే ఉపయోగం ఉంటుంది. వచ్చే అరకొర నీరుతో పంటలు సాగు చేసినా చివరి దశలో నీరు లేకపోతే కష్టం.

–ప్రభాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం బత్తలపల్లి మండలాధ్యక్షుడు

క్లుప్తంగా

మరువ పారుతున్న అప్పరాచెరువు

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి చొరవతో నాలుగేళ్లుగా కృష్ణాజలాలతో నిండిన చెరువు


మరువ పారుతున్న అప్పరాచెరువు

బత్తలపల్లి: ధర్మవరం నియోజకవర్గంలోని పెద్ద చెరువుల్లో రెండవదైన అప్పరాచెరువు గురువారం మరువ పారింది. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అప్పటి ఇరిగేషన్ అధికారులతో చర్చించి గత నాలుగేళ్లు కృష్ణాజలాలను అప్పరాచెరువుకు తరలించి చెరువును నింపారు. మత్స్యకారులు, గ్రామ పెద్దల కోరిక మేరకు చివరి సంవత్సరం చెరువుకు నీరు తరలించలేదు. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షలకు నీరు ఉధృతంగా రావడంతో చెరువు నిండి మరువ పారుతోంది. 962 ఎకరాల్లో ఉన్న చెరువు నిండడం వల్ల బత్తలపల్లి మండలంలోని పది గ్రామాలు, తాడిమర్రి మండలంలోని ఐదు గ్రామాలు, ధర్మవరం మండలంలోని నాలుగు గ్రామాల్లో భూగర్భజలాలు పెరగుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువు కింద సుమారు 504 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది.

'కార్యదర్శి గారు.. సమస్య పరిష్కరించండి'

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని యల్లమ్మ ఆలయం వీధి, బ్యాంక్‌బజారు, కొత్తబజారు, ట్యాంకి బజారులో సుమారు 20 రోజులగా వీధి దీపాలు వెలగడం లేదని, సమస్యను పంచాయతీ కార్యదర్శి తెలియజేసినా పటించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెయిన్ స్విచ్ పని చేయకపోవడంతోనే సమస్య తలెత్తిందని వారు చెబుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు వివరణ కోరగా సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ సక్రమంగా విధులు నిర్వహించక పోవడంతో అతడిని విధుల నుంచి బహిష్కరించారని, అతని స్థానంలో కొత్త ఎనర్జీ అసిస్టెంట్ చేరిన వెంటనే మెయిన్ స్విచ్ మరమ్మతులు చేయిస్తామన్నారు.

విద్యార్థినులకు క్విజ్ పోటీలు


మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల సేవలను కొనియాడారు. పోలీస్ స్టేషన్‌లోని వైర్‌లెస్ సెట్ వినియోగం, ఆయుధాల ఉపయోగాలపై వివరించారు. అనంతరం క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

బత్తలపల్లి: రీ సర్వేలో భాగంగా వచ్చిన భూసమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ స్వర్ణలత తెలిపారు. గురువారం గరిశలపల్లి గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వేలో భాగంగా వచ్చిన భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందన్నారు. సమస్యలున్న రైతులంతా ముందుకు వచ్చి అర్జీలను ఇస్తే అధికారులు వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారన్నారు. అనంతరం రైతుల నుంచి 80 అర్జీలను స్వీకరించారు. సర్వే ఐడీ మురళి, రీసర్వే డీటీ షణ్ముఖ కుమార్, సర్వేయర్ జోసఫ్, వీఆర్‌ఓలు తలారి చంద్రశేఖర్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు


కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: కదిరికుంట్లపల్లిలో హరిజనవాడ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను గురువారం ఎంపీడీఓ పోలప్ప, పంచాయతీ రాజ్ జేఈ గుప్తా ఆధ్వర్యంలో తొలగించారు. సీసీరోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ కింద రూ.20 లక్షలు మంజూరైనట్లు వారు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

మహిళకు పాముకాటు

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని బడన్నపల్లి గ్రామానికి చెందిన సువర్ణ అనే వ్యవసాయ కూలీ గురువారం పొలంలో పనులు చేసుకుంటుండగా పాముకాటుకు గురైంది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పరిహారం చెల్లింపులో తేడాలపై నిలదీత


అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు, రైతులు

పుట్టపర్తి: 342 జాతీయ రహదారి కోసం భూములు, ఇళ్లు, స్థలాలు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించే విషయంలో తేడాలు ఎందుకు చూపుతున్నారంటూ రైతులు డీఈ గిడ్డన్న, ఏఈ రాఘవేంద్రను నిలదీశారు. గురువారం బుచ్చయ్యగారిపల్లిలో భూ నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రైతులు, గ్రామస్తులు మాట్లాడుతూ రహదారి కోసం తమ విలువైన ఇళ్లు, స్థలాలు, భూములు ఇచ్చామన్నారు. అయితే పరిహారం విషయంలో ఒక్కొక్కరికి ఒక్కోలా చెల్లిస్తున్నారన్నారు. పరిహారం అందరికీ సమానంగా అందించాలన్నారు. ఇప్పటికీ కొంతమందికి పరిహారం అందలేదన్నారు. పరిహారం అందించిన తర్వాత పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేశవరెడ్డి, బట్టల కేశప్ప, బోయగడ్డ జయరామ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపిక


ప్రతిభ కనబరిచిన నసనకోట విద్యార్థులు

రామగిరి: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల శ్రీకాళహస్తిలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో నసనకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్–17 విభాగం 90 కేజీల విభాగంలో ముద్దు కృష్ణ ఉత్తమ ప్రతిభ కనబరచి బంగారు పతకం సాధించినట్లు ఆ పాఠశాల పీడీ చామంతి తెలిపారు. 73 కేజీల పోటీల్లో విజయరాజు రాణించి వెండి పతకం సాధించినట్లు పేర్కొన్నారు. నవంబర్ నెలలో జమ్మూలో జరిగే జాతీయస్థాయి జూడో పోటీలకు ముద్దుకృష్ణ ఎంపికైనట్లు వెల్లడించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు సత్కరించారు.

శ్మశానానికి స్థలం కేటాయించండి


శ్మశాన వాటిక ఏర్పాటుపై ఆర్డీఓతో చర్చిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ

ముదిగుబ్బ: ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి వెళ్లే రహదారి విస్తరణలో భాగంగా రామస్వామి తండాలో శ్మశాన వాటికను తొలగించారు. తండావాసుల విజ్ఞప్తి మేరకు గురువారం ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ విషయాన్ని ఆర్‌డీఓ మహేష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన రెవెన్యూ అధికారులు శ్మశాన వాటిక కోసం స్థలాన్ని త్వరలోనే కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆర్‌డీఓను కలిసిన వారిలో పొడరాళ్లపల్లి సర్పంచ్ నాగభూషణ, రామస్వామి తండా సర్పంచ్ మినీబాయి ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి


పోటీలను పరిశీలిస్తున్న వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు, ప్రిన్సిపాల్ ప్రగతి

హిందూపురం టౌన్: ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయి. సెల్‌ఫోన్‌లో వచ్చే వివిధ లింక్‌లను ఓపెన్ చేసి మోసాలకు గురికావద్దు. సైబర్ మోసాలపై అవగాహన అవసరమని వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు విద్యార్థినులకు సూచించారు. గురువారం పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి ఆధ్వర్యంలో సైబర్ నేరాలను అరికట్టడంలో యువత పాత్ర, వాతావరణ పరిరక్షణలో పోలీసులు ఎదుర్కొనే సవాళ్లు అనే అంశాలపై వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విజేతలకు త్వరలో జిల్లా పోలీస్ కార్యాలయంలో పోటీల్లో నిర్వహిస్తామన్నారు.

ఘనంగా ఐక్యరాజ్య సమితి దినోత్సవం..

కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, హిందీ విభాగం సంయుక్తంగా స్వచ్ఛత హీ సేవలో భాగంగా ఐక్యరాజ్య సమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి మాట్లాడుతూ.. దేశాల మధ్య సమన్వయం, ప్రపంచ శాంతి నెలకొల్పడంలో ఐక్యరాజ్య సమితి పాత్రను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు యశోదా దేవి, సరస్వతి, ఎన్ఎస్ఎస్ పీఓ రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, అధ్యాపకులు గోపాల్ పాల్గొన్నారు.

ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్ఐ


ఎస్పీకి పూల మెక్కను అందజేస్తున్న ఎస్ఐ నరసింహులు

పుట్టపర్తి టౌన్: తలుపుల ఎస్ఐ నరసింహులు డీపీఓలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీరత్నను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డుకట్టు వేయాలని, శాంతి భద్రతలపై దృష్టి సారించాలని ఎస్పీ ఆయనకు సూచించారు.

సకాలంలో సరుకులు పంపిణీ చేయండి


మాట్లాడుతున్న తహసీల్దార్ అనంతాచారి

ఓడీచెరువు: చౌక దుకాణాల ద్వారా కార్డుదారులకు సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ అనంతాచారి డీలర్లకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జరిగిన డీలర్ల సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. బఫర్ నిల్వలపై ప్రస్తుత డీలర్లు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు రెడ్డి, ఆర్ఐ మున్వర్‌బాషా, డీలర్లు పాల్గొన్నారు.

6న ఖాద్రీ ఆలయంలో బహిరంగ వేలం

కదిరి టౌన్: వచ్చే నెల 6న షాపురూముల అద్దె, క్లోక్ రూం, టెంకాయలు, పూజా సామగ్రి విక్రయం, బియ్యం, బేడల సేకరణ హక్కు కోసం ఖాద్రీ ఆలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని ఎంజీ రోడ్డు(చౌక్)లో షాపు రూంలు గ్రౌండ్ ఫ్లోర్ 2, పై భాగంలో 2 షాపు రూములను మూడేళ్లపాటు అద్దెకు ఇస్తామని తెలిపారు. లగేజీ, సెల్‌ఫోన్లు భద్రపర్చుకునే హక్కు, ఉమామహేశ్వరి ఆలయం ముందు భాగమున టెంకాయలు, పూజాసామగ్రి అమ్ముకునే హక్కు, భక్తులు సమర్పించు బియ్యం బేడలు పోగుచేసుకొను హక్కు కోసం వేలం ఉంటుందని పేర్కొన్నారు. వస్తువుల సరఫరా, క్యాలెండర్, స్థలపురాణం, క్లాత్ బ్యాగ్, లామినేషన్ ఫొటోలు, ప్యాకెట్ సైజ్ ఫొటోలు,యంత్రం, సింథటిక్ ఫ్రేమ్ ఫొటోలు అమ్ముకునే హక్కు, లడ్డూ కవర్లు, విద్యుత్ సామగ్రి సరఫరా హక్కు కోసం ఈ టెండర్, సీల్డ్ టెండర్లు నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 9000490670 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శిగా రామాంజనేయులు


ఎంపికైన కార్యదర్శితో కార్యవర్గ సభ్యులు

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శిగా పాలేల రామాంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. గురువారం పుట్టపర్తిలోని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర శాఖ నుంచి రఘురామనాయుడు హాజరయ్యారు.ఈసందర్భంగా జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధానకార్యదర్శిగా రామాంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.

ఘనంగా ఐక్యరాజ్యసమితి దినోత్సవం


మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి రాజనీతిశాస్త్ర విభాగ అధిపతి గోపాల్‌నాయక్ మాట్లాడుతూ నానాజాతి సమితి అనంతరం ఏర్పాటు చేసిన ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని ఏటా అక్టోబర్ 24న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు త్రివేణి, చిట్టెమ్మ, షమీవుల్లా, కిరణ్‌కుమార్, పావని, హైమవతి, పుష్పావతి, సరస్వతి, ఆనంద్, మీనా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి: వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని న్యామద్దెల సర్కిల్ వద్ద ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాన్ని నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, ద్విచక్ర వాహనంలో ముగ్గురు వెళ్లడం, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థి నాగయశ్వంత్‌తో ఉపాధ్యాయులు

కనగానపల్లి: ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థి నాగయశ్వంత్ ప్రతిభ కనబరిచాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 విభాగంలో విద్యార్థి 5వ స్థానంలో నిలిచాడని పాఠశాల పీడీ మాధవరాజులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రవి కిరణ్, ఉపాధ్యాయులు విద్యార్థిని, పీడీని ప్రత్యేకంగా అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ


తనకల్లు: చీకటిమానిపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామీణ కూట సంస్థ ఆధ్వర్యంలో బేబీ కుర్చీలు, జంఖానాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగాసీడీపీఓ గంగరత్నమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావంతో ముందుకు సాగాలన్నారు. కుర్చీలు, ఇతర వస్తువులు అందజేసిన గ్రామీణ కూట సంస్థ ప్రతినిధులను అభినందించారు. సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, సంస్థ డివిజనల్ మేనేజర్ జగదీష్, కార్యకర్తలు రెడ్డమ్మ, దిల్షాద్, అలివేలు, కవిత, నాగరాణి, మహిళలు పాల్గొన్నారు.

ఉర్దూ పోస్టులు ప్రకటించాలి

హిందూపురం: డీఎస్సీలో ఉర్దూ పోస్టులు ప్రకటించాలని నిరుద్యోగులు కోరారు. హిందూపురం ఉర్దూ భాషా అభివృద్ధి సంఘం ప్రెసిడెంట్ మహమ్మద్ రఫీక్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీలో ఉర్దూ ఖాళీలు భర్తీ చేయాలని డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోండి


ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్య సిబ్బంది విద్యార్థులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని కనుముక్కల ఉన్నత పాఠశాలలో ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. పోలియోను నిర్మూలించేందుకు అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పార్వతి, సీహెచ్ఓ సౌందర్య, ఏఎన్ఎం సునీత, ఆశావర్కర్ సరస్వతి పాల్గొన్నారు.

వర్షపాత నమోదు కేంద్రాల పనితీరు పరిశీలన


బత్తలపల్లిలోని వాతావరణ కేందాన్ని పరిశీలిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ వెంకటప్రసాద్

బత్తలపల్లి: మాల్యవంతం, దంపెట్ల, చెన్నరాయపట్నం, బత్తలపల్లిలో ఉన్న ఆటోమేటిక్ వెదర్‌గేజ్ స్టేషన్(వాతావరణ, వర్షపాత కేంద్రాలు) పనితీరును గురువారం విజయవాడ వాతావరణ శాఖ అధికారులు పరిశీలించారు. ఆయా కేంద్రాలు ప్రతి గంటకు గాలిలోని తేమ శాతం, ఉష్ణోగ్రత, గాలి వేగం, గాలి దిశ తదితర వివరాలను శాటిలైట్ ద్వారా పంపుతున్నాయా లేదా అనే విషయాన్ని ఇంజినీర్ ఎన్‌వీ హేమంత్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటప్రసాద్ పరిశలించారు. ప్రతి రెండు నెలలకు ఒక్కసారి వారు కేంద్రాలను పరిశీలిస్తుంటారని ఏఎస్ఓ లక్ష్మీనరసింహ తెలిపారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు


డిగ్రీ కళాశాలలో పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీసులను స్మరిస్తూ ఏటా అక్టోబర్ 21న అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటారని కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత తెలిపారు. వ్యాసరచనలో 'సైబర్ నేరాల నియంత్రణలో యువత పాత్ర' వక్తృత్వ పోటీలో 'సమాజంలో శాంతిభద్రతలు పరిరక్షించడంలో పోలీసు సిబ్బంది సవాళ్లు' అన్న అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. సీఐ నారాయణరెడ్డి, ఎస్ఐ బాబ్జాన్, ఏఎస్ఐ సుబ్బారావు పాల్గొన్నారు.

ఆముదంలో పంటకోత ప్రయోగాలు


పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

బత్తలపల్లి: పోట్లమర్రి గ్రామంలో ఏఎస్ఓ డాక్టర్ కెఎస్ లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో గురువారం ఆముదం పంటలో పంటకోత ప్రయోగాలను చేపట్టారు. గ్రామానికి చెందిన సాకే శ్రీనివాసులు సర్వే నంబర్ 333–2సి పొలం ఆముదం పంటలో నిర్ణీత విస్తీర్ణంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఇందులో 8 కేజీల 350 గ్రాములు, మరో రైతు హరిజన నాగభూషణ సర్వే నంబర్ 352–11 పొలంలో 3 కేజీల 860 గ్రాములు దిగుబడి వచ్చినట్లు తెలిపారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ డివిజనల్ కోఆర్డినేటర్ చంద్ర, ఇన్సూరెన్స్ ఏజెంట్లు మంజునాథ, మహేష్, చాంద్‌బాషా, వీఎస్ఏ ముత్యాలప్ప, రైతులు తదితరులు పాల్గొన్నారు.